# అవసరం




**రాత్రికి యవ్వనమొచ్చింది.**

ఇంటికి త్వరగా వెళ్ళాలన్న ఆలోచనతో త్వరగా నడుస్తున్నాను.

ఎందుకో తలెత్తి చూసిన నేను ఉలిక్కి పడ్డాను.

చూడకూడదనుకుంటూనే తిరిగి చూశాను.

బస్టాపు షెల్టరు వెనకగా నిలబడి వుందామె. వయసులోనే వుంది. మగాడు కనబడితేనే సిగ్గు పడాల్సిన ఆ వయసులో ఆమె ఒంటిపైన నూలు పోగు కూడా లేదు. నగ్నంగా వుంది. జుత్తు బిరుసెక్కి జడలు కట్టింది. ముక్కు వుండవలసిన పద్ధతిలో కాక అతుక్కుపోయి అదోలా వుంది.

అయితే ఆమె రూపు కాదు నాకు రోత కలిగించింది.

పెద్ద కడుపుతో ఆ స్థితిలో అలా నిలబడి వుండడం.

ఆమె కళ్ళల్లో ఆకలి....

మొహంలో దీనత్వం....

కృశించిన శరీరం, పొట్టకి పైగా ఛాతీ స్థానంలో ఎత్తుగా నిటారుగా నిలచిన గుండెలు.... అలా మట్టి పేరుకుపోయి అసహ్యంగా వున్న ఆ శరీరాన్ని మోయడమే కాక, తనలో పెరుగుతున్న మరో ప్రాణిని భూమ్మీద పడేయడానికి సిద్ధంగా వుంది ఆ ప్రాణి.

అయితే నా బాధ అది కాదు. అలాంటి దిక్కులేని, వికారమైన ఆడదాన్నికూడా విడవకుండా దానికి కడుపుచేసిన మారాజెవరో తెలుసుకోవాలన్న ఓ చిత్రమైనకోరిక కలిగింది నాకు.

ఒకసారి అలాంటి ఆడదానితో సంబంధం పెట్టుకున్నాడంటే ఎప్పుడో ఒకప్పుడు తిరిగి దాని దగ్గరకి వాడు తప్పకుండా వస్తాడన్న నమ్మకం నాకుంది. ఆరోజు నుంచి నేను రోజూ జాగ్రత్తగా అక్కడికి రాంగానే పరిసరాలని గమనించడం మొదలుపెట్టాను.

ఆ బస్టాపు షెల్టర్ వెనకే వుంటుంది ఆమె.

అక్కడికొచ్చేసరికి నా చూపులు మారిపోతాయి. ఎవరన్నా నన్ను గమనిస్తున్నారేమో నన్న భయం, కంగారులో కూడా అక్కడికి రాగానే ఆ భిక్షకత్తె కోసం చూడ్డం నా దినచర్యగా మారియింది.

ఎన్నో నెలో?

మరో రెండు నెలల్లో అది బిడ్డని కంటుంది. దానికే తిండానికిలేదు. పుట్టే బిడ్డని ఏంచేస్తుందో నన్న చిన్న కలవరం నాలో, పిచ్చి ఊహే. కానీ ఈ ప్రపంచంలో అలాంటి అనాథలు, పసిపిల్లలు కోట్ల సంఖ్యలో వున్నారని తెలుసు.

ఆ రోజు ఆఫీసు నుంచి బయటపడ్డాను. ఓ ఫ్రెండ్ వస్తే కాస్సేపు బతాఖానీ కొట్టి చీకటి పడ్డాక బయల్దేరాను.

పిల్లలకి బిస్కట్లు కొందామని బేకరీలోకి నడిచాను.

పక్కనే నిలబడి వున్న గ్లాస్కో లాల్చీ మనిషి ఒకతను షాపువాడు ఆలస్యం చేశాడని తెగ విసుక్కుంటున్నాడు.

అతనో రొట్టె కొనుక్కున్నాడు. అతనెక్కడో చూసినట్టుగా అనిపించింది. కానీ గుర్తు రావడం లేదు. పరిచయమైన మొహం.

నాకు పది గజాల దూరంలో అతడు నడుస్తున్నాడు.

అతను ఉన్నట్టుండి ఆగిపోయాడు. నేను అతని పక్కకి వచ్చేశాను.

అతని చేతిలో ఆకులున్నాయి. రోడ్డు పక్కనే వున్న నల్లా దగ్గరికి నడిచాడు. నేను సిగరెట్ వెలిగించి నిలబడ్డాను. నల్లాలోంచి నీళ్ళు రావడం లేదు. పక్కనే వున్న కుంటలో నీళ్ళని చేతిలోకి తీసుకుని ఆకులకందిస్తున్నాడు బహుశా సున్నాన్ని తడపడానికి.

అంత నీట్‌గా వున్న ఆ వ్యక్తి మురికి నీళ్ళతో సున్నాని తడిపి ఆకులకి రాసుకుంటుంటే నాకు అసహ్యంతో పాటు పిచ్చెక్కిపోయింది.

అతను రోడు మీది కొచ్చి నడవడం మొదలుపెట్టాడు. నిర్మానుష్యంగా వుంది రోడ్డు.

ఉన్నట్టుండి నాకేదో అర్థమైంది. నవ్వొచ్చింది.

• • •

ఆ తరువాత నేను నా కొచ్చిన అనుమానం గురించి అంతగా పట్టించుకోలేదు.

ఎడిటర్లు, రచయితలు, క్లర్కులు. అందర్లూ....మన ప్రపంచం ఇది. •

